www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 18 ఏప్రిల్ 2025

5

కాకినాడ



19న వక్ఫ్ సవరణ చట్టంపై సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

రఘుపతి వెంకటరత్నంనాయుడు (ఆర్‌విఎన్) స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ శనివారం సాయంత్రం 5.30 గంటలకే కచేరీపేటలోని యుటిఎఫ్ హోంలో 'వక్ఫ్ చట్ట సవరణ - పర్యవసానాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్. గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రతి నెలా సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై ప్రతి నెలా యుటిఎఫ్ హోంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలోభాగంగానే వక్ఫ్ చట్ట సవరణపై నిర్వహిస్తున్న సదస్సులో ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.చిష్టీ, ప్రముఖ న్యాయవాది మహ్మద్ జవహర్ అలీ పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకి అందరూ ఆహ్వానితులేనని ఆయన తెలిపారు.

కష్టాల్లో క్షేత్ర సహాయకులు

- ఏళ్ళు గడుస్తున్నా పెరగని వేతనాలు
- ఉద్యోగ భద్రత లేక అవస్థలు
- ఆందోళన బాటలో ఫీల్డ్ అసిస్టెంట్లు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి చూపించే క్షేత్ర సహాయకులు కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. 19 ఏళ్లుగా గ్రామీణ వ్యవసాయ కార్మికులకు పనులు కల్పించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నా ప్రభుత్వం వీరి సేవలను గుర్తించలేకపోతోంది. 19 ఏళ్లుగా అరకొర వేతనాలతోనే జీవనం సాగిస్తూ కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఏర్పడింది. వయస్సు పెరుగుతున్నప్పటికీ ఎదుగు బొదుగు లేకుండా ఉపాధి చట్టం పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నారు. తమను గుర్తించి విధులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6.92 లక్షల జాబ్ కార్డులుండగా 48 వేల శ్రమశక్తి సంఘాలున్నాయి. 50 మంది ఏపిఒలు, 20 మంది ఇంజినీరింగ్ కన్సల్టెన్స్(ఇసి), 20 మంది జూనియర్ ఇంజినీర్లు(జెఇ), 160 మంది టెక్నికల్ అసిస్టెంట్స్ (టిఎ), 130 మంది కంప్యూటర్ ఆపరేటర్లు(సిఒ)లతో పాటు 1060 మంది ఫీల్డ్ అసిస్టెంట్స్ (ఎఫ్ఎ)లు గత 19 ఏళ్లుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనుల గుర్తింపు, అడిగిన వారందరికీ పని కల్పించడం, ప్రతి కుటుంబానికి 100 రోజుల పని ఇవ్వడం, మస్తర్ల నమోదు పర్యవేక్షణ, సకాలంలో వేతనాలు మంజూరు చేయించడం వంటి విషయాలలో వీరు కీలకంగా పనిచేస్తున్నారు.

ప్రశ్నార్థకంగా ఉద్యోగ భద్రత

దాదాపు 2 దశాబ్దాల పాటు విధుల్లో ఉండగా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఫీల్డ్ మీదుండి పనులు చేయించే తమకే పనిలేని లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేన్ డేస్ విధానంతో అనేకమంది ఎఫ్ఎలు ఇప్పటికే తమ ఉద్యోగాలను కోల్పోయారు. కనీస వేతనాలకు కూడా నోచుకోకుండానే ఈ చట్టంలో ఏళ్లుగా పని చేస్తున్నా గుర్తింపు లేదు. గ్రామీణ అభివృద్ధి శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత ప్రభుత్వం పిఆర్‌సి ప్రకారం 23 శాతం జీతాలు పెంచకపోగా, పదోన్నతులు కూడా కల్పించలేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురైన గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. 2014- 2019 మధ్యకాలంలో అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి ఎపిడిల దాకా పదోన్నతులు కల్పించారు. ఎపిడిలకు అడిషనల్ పీడీలుగా పదోన్నతులు కల్పించారు. 20 శాతం వేతనాలు కూడా పెంచారు. అయితే గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఎవరికీ ఎటువంటి పదోన్నతులు కల్పించలేదు. దీంతో సిబ్బంది తీవ్ర నిరాశతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. దీంతో ఉద్యోగులు ఆయనపై గంపెడాశలు పెట్టుకున్నారు. 19 సంవత్సరాల సర్వీసును గుర్తించి గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించి విధులను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. మండలం యూనిట్ గా తీసుకుని అంతర్గత బదిలీలు చేయడం ద్వారా స్థానిక ఒత్తిళ్ళను అధిగమించి మరింత సమర్థవంతంగా పనిచేయడానికి అవకాశం ఇప్పించాలని, పూర్తి స్థాయి హెచ్‌ఆర్ పాలసీతో హెల్త్ కార్డులు, ప్రమాద బీమా, గ్రాట్యుటీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విధి నిర్వహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇప్పించి మరణ పరిహారం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. 2016, 2019లో ఈ చట్టంలో పని చేస్తున్న అన్ని క్యాటగిరి ఉద్యోగులకు వాళ్లకు జీతాలు పెరిగాయి. కానీ ఫీల్డ్ అసిస్టెంట్‌కు పెరగలేదు. అదే నిష్పత్తిలో తమకూ కూడా పెంచాలని విద్యార్హతలు ఆధారంగా పదోన్నతులు ఇచ్చి అర్హతలు ఉన్నవారిని కంప్యూటర్ ఆపరేటర్లుగా, టెక్నికల్ అసిస్టెంట్‌లుగా నియమించాలని కోరుతున్నారు.

దశలవారీగా ఆందోళన

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు దశలవారీగా ఆందోళన బాట పట్టారు. ఈనెల 16న నల్ల రిబ్బన్లను ధరించి మండల ఎపిఒ, ఎంపిడిఒలకు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈనెల 21న ఒక రోజు పనులను పూర్తిగా నిలిపివేసి పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించడంతోపాటు కలెక్టర్‌కు సమ్మెకు దిగుతున్న కారణాలను వివరిస్తూ వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. ఈనెల 28 నుంచి పూర్తిగా విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతామని ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు.

సానుకూలంగా స్పందించాలి



కూటమి ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించి జీవితాలలో వెలుగులు నింపుతాదని ఇన్ని రోజులు ఎంతో ఆశగా ఎదురుచూశాం. కానీ ఎటువంటి పరిష్కారం లభించకపోగా మానసిక, భౌతిక దాడులు జరుగుతున్నాయి. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో మాకు మద్దతుగా నిలవకపోగా మీరెంత, మీ ఉద్యోగాలెంత, ఒక్క పేపర్ మీద పెన్ను పెడితే ఊడిపోయే ఉద్యోగాలంటూ హేళన చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. అందుకే న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమ బాట పట్టాము.

కడమటి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు,
ఎన్‌ఆర్‌ఇజిఎస్ క్షేత్ర సహాయకుల సంక్షేమ సంఘం

సమస్యలను పరిష్కరించాలి



కనీస వేతన చట్టం ప్రకారం రూ.26 వేలు వేతనం ఇవ్వాలి. 19 ఏళ్లుగా పని చేస్తున్న మా సేవలను గుర్తించి తక్షణమే మా విధులను క్రమబద్ధీకరించాలి. అందరి ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లకు సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి.

గుబ్బల సత్యవేణి, జిల్లా కార్యదర్శి,
ఎన్‌ఆర్‌ఇజిఎస్ క్షేత్ర సహాయకుల సంక్షేమ సంఘం



జెఎన్‌టియుకెలో జరిగిన కీడా దినోత్సవ వేడుకలో మాట్లాడుతున్న ఎస్‌పి బిందుమాధవ్

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఏ రంగంలోనైనా గెలుపు-ఓటమిని సమానంగా స్వీకరించాలని ఎస్‌పి జి.బిందు మాధవ్ అన్నారు. గురువారం జెఎన్‌టియుకెలో జరిగిన క్రీడా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీ పరీక్షలలో పాల్గొనే వారి సంఖ్యను చూసి భయపడుతున్నారని, కానీ ఉన్న ఉద్యోగాల్లో తనకు కావాల్సింది ఒకటేనని గుర్తు చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. క్రీడలు పోటీ తత్వాన్ని పెంచుతుందని, గెలుపోటములను సమానంగా స్వీకరించడం లాంటివి ద్వారా గ్రహించగలుగు తామన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యం, ఉల్లాసం కలుగుతాయని, ప్రతిఒక్కరూ ప్రతిరోజు కొంత సమయం క్రీడలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకె విసి ప్రసాద్, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

బకాయి వేతనాలు, బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



మిడ్డే మీల్స్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాల్సిన బకాయి వేతనాలు, బిల్లులను తక్షణమే విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ మండల సమావేశం యూనియన్ అధ్యక్షులు సిహెచ్. వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా మిడ్డే మీల్స్ కార్మికుల వేతనాలు, బిల్లులు వేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వంటకు అవసరమైన గ్యాస్‌ను సైతం కార్మికులే కొనుగోలు చేయాల్సివస్తుందని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, పనికి గుర్తింపుగా యూనిఫామ్, ఐడి కార్డులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 21న ఎంఇఒకు వినతిపత్రం ఇవ్వడం ద్వారా నిరసన తెలియచేయాలరీ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో కార్మికులు అనంతలక్ష్మి, అంగాలక్ష్మీ, సుబ్బలక్ష్మి, అమ్మాజీ, సత్యవతి పాల్గొన్నారు.



విద్యార్థినిని సత్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రథమ స్థానంలో నిలిచిన ఇంటర్ విద్యార్థికి సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ

ఇంటర్ ఎంపిసి గ్రూపులో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినిని కలెక్టర్ షాన్‌మోహన్ సత్కరించారు. జిల్లాలోని గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపిసి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని జ్యోతుల సాయిజ్యోతి 983 మార్కులు సాధించి జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి స్థానం సాధించింది. ఈ నేపథ్యంలోనే గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ ఆమెను సత్కరించి రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం సాధారణమైన విషయం కాదన్నారు. ఇదే పట్టుదలతో ఉన్నత చదువులు అభ్యసించి మంచి స్థానానికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సాయిజ్యోతి చదువుకోవడానికి చక్కటి ప్రోత్సాహన్ని అందించిన తల్లిదండ్రులను, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నీతిపూడి గోవిందు, తల్లిదండ్రులు సత్తిబాబు, పార్వతి పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కెల్లో ధాన్యానికి మద్దతు ధర

ప్రజాశక్తి - యంత్రాంగం



గొల్లప్రోలులో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్

కాజులూరు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ తెలిపారు. గురువారం మండలంలోని పల్లిపాలెం, కోలంక, పెదలంక గ్రామాల్లో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 21 రైతు సేవా కేంద్రాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. ఈ కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మకం చేస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. తేమ శాతం 17 శాతం లోపు ఉండాలన్నారు. రైతులకు అదనపు ఆదాయం చేకూర్చేందుకు సబ్సిడీపై అపరాలు అందించడం జరుగుతుందని, రైతులకు కావలసిన అపరాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు అనివిళ్ళ ప్రకాష్, దుర్గాప్రసాద్ రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండల పరిధిలో 18 ఆర్‌సికెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ శాఖ ఎఒ కె.సంజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కాండ్రకోటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మండల పరిధిలో 3 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం 10 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందన్నారు. రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే అమ్మకాలు జరపాలని విజ్ఞప్తి చేశారు. **గొల్లప్రోలు** మండలంలోని చేబ్రోలులో ఆరబోసిన ధాన్యం రాసులను పాడా పీడీ చైత్రవర్షిణి, వ్యవసాయ శాఖ జెడీ ఎన్.విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు గొల్లప్రోలు, చేబ్రోలులోని కొనుగోలు కేంద్రాల ద్వారా 638 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 36 గంటల లోపు ధాన్యం అమ్మిన రైతు బ్యాంకు అకౌంట్లో డబ్బులు జమ అవుతు న్నాయని తెలిపారు. ఈ పర్యటనలో తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ, పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, మండల ఎఒ కెవివి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

19న తునిలో మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 19న తునిలోని ఆర్‌వివిఎస్‌జెఆర్‌బి జడ్‌పి గరల్స్ హైస్కూల్‌లో వికాస ఆధ్వర్యంలో మిని జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కెఎల్.రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమో, బిటెక్, బి.ఫార్మసి, ఎం.ఫార్మసీ, ఎంఎస్‌సి ఉత్తీర్ణులైన 30 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.13 వేల నుంచి రూ.20 వేల వరకూ జీతం, ఇన్సెంటివ్స్ భోజనం, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 19న జరిగే ఇంటర్వ్యూలకు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్సులతో హాజరుకావలన్నారు. మరిన్ని వివరాలకు 7799376111 సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా నవీన్ పుట్టినరోజు

ప్రజాశక్తి - కిర్లంపూడి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ పుట్టిన రోజు వేడుకను టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం కిర్లంపూడిలో జరిగిన ఈ కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షుడు చదరం చంటిబాబు, నాయకులు తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక పిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలో ఎంపిపి తోట రవి, ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు, సర్పంచులు వీరంరెడ్డి కాశీబాబు, గుడాల శ్రీలత, జ్యోతుల రాంబాబు, డిసి వైస్ ఛైర్మన్ నీలం శ్రీను, నీటి సంఘం అధ్యక్షుడు తూము శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో మాధురి విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - శంఖవరం



చిన్నారులను అభినందిస్తున్న తమ్మయ్యబాబు

అబాకస్ వైదిక్ గణిత పరీక్షల్లో కత్తిపూడి మాధురి స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. 4వ తరగతి విద్యార్థి ఆర్‌డిఎస్.మణికంఠ అబాకస్ లెవెల్ టూలో ఫస్ట్ ర్యాంక్, 3వ తరగతి విద్యార్థి దాడిపట్ల సత్యభాస్కర్ లెవెల్ వన్‌లో థర్డ్ ర్యాంకు, 7వ తరగతి విద్యార్థి తాటిపాకల శివదుర్గ రామ్‌చరణ్ లెవెల్ 4లో థర్డ్ ర్యాంక్ సాధించారు. వీరికి కాకినాడలో జరిగిన ఓ కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాధురి విద్యా సంస్థ ఛైర్మన్ కడారి తమ్మయ్యబాబు అభినందించారు.

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - పెద్దాపురం



మంటలను ఆర్పుతున్న విద్యార్థిని

పెద్దాపురం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని పలు పాఠశాలల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్రం ఎడిఎఫ్ఒ ఎం.శ్రీహరిజగన్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవ లసిన జాగ్రత్తలు, మంటలను ఆర్పటంలో మెలకువలను, మంటల్లో చిక్కుకున్నప్పుడు తప్పించుకునే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పిఆర్‌ఆర్.ప్రసాద్, ఎన్.గీతాప్రసాద్, వై.వీరబాబు, ఎల్.సుధాకరరావు, ఎ.మురళీకృష్ణ, ఎండి.యాకూబ్, ఎం.సురేష్, జి.చిరంజీవి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని సూరంపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పట్వాడా కార్యక్రమంలో పిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరు నెలలపాటు బిడ్డ పెరుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు హెచ్‌వి.లక్ష్మీరమణ, ఎఎన్ఎం శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - సామర్లకోట

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఐఎటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఎఐటియుసి పట్టణ నాయకులు పెద్దిరెడ్ల సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఆప్కాస్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ రిటైర్మెంట్ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పూర్తిస్థాయిలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపచేయాలని, ప్రభుత్వం చిత్తుచిద్ధితో వారి సమస్యలను పరిష్కరించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బొత్స శ్రీను, కార్మికులు మల్లిపూడి లక్ష్మి, మిరియాల పెద్ద, చెన్న వెంకటేశ్వర్లు, చిడతా వరలక్ష్మి, కసింకోట ఆనందరావు, సింగంపల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని రాస్తారోకో

ప్రజాశక్తి - పెద్దాపురం

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం సామర్లకోట - ప్రత్తిపాడు రహదారిలోని పులిమేరు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి రమేష్ మాట్లాడారు. ఎన్నో కష్టాల పడి పంటలు పండించిన రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. వెంటనే గిట్టుబాటు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడికి సత్యం, కర్నాకుల రామలింగేశ్వరరావు, ఎల్లే.సత్తిబాబు, బీడీల నాగరాజు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



దాట్ల సాహిత్య కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి - కాజులూరు



పురస్కార గ్రహీతను సత్కరిస్తున్న స్థానిక పెద్దలు

దాట్ల సాహిత్య కృషి ప్రశంసనీయమని ఎస్‌డివిఆర్‌ఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ దంతులూరి అనంతవర్మ అన్నారు. గురువారం మండలంలోని కోలంక ఎస్‌డివిఆర్‌ఆర్ఎ ఉన్నత పాఠశాలలో 'కళారత్న' పురస్కార గ్రహీత కవి, కథకుడు దాట్ల దేవదానంరాజుకు సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి దేవదానంరాజు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న పురస్కారాన్ని అందుకోవడం అభినందనీయమన్నారు. యానాం డాక్టర్ ఎస్‌ఆర్‌కె ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి మాట్లాడుతూ దేవదానంరాజు కథ, కవిత్వం, చరిత్ర, యాత్రాకథనం వంటి వివిధ ప్రక్రియల్లో అద్భుతంగా రచనలు చేయడం ప్రశంసనీయమన్నారు. ఈ రీజెన్సీ పబ్లిక్ స్కూల్ హెచ్ఎం తాతపూడి ప్రసాదరావు, ఆంధ్రీకుటేరం సంచాలకులు మధునాపంతుల సత్యనారాయణ మూర్తి అవార్డుగ్రహీత అధ్యయనశీలత, పట్టుదల, కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు భూపతిరాజు వెంకట సూర్యనారాయణ, సిహెచ్. సత్యనారాయణరాజు, హెచ్ఎం మల్లిపూడి రంగారావు, స్థానికులు వీరభద్రరాజు, వరదా శేషారావు, రామభద్రరాజు, కొండ్రాజు, కనుమూరి రామకృష్ణ, సహకార సంఘం మాజీ అధ్యక్షులు భూపతిరాజు రామచంద్రరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



నిర్వాహకులకు ఫ్యాన్లను బహుకరిస్తున్న దాతలు

భోజనాల షెడ్డుకు ఫ్యాన్ల బహూకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ మాతృత్వం కార్యక్రమంలో గర్భిణులకు నిర్వహిస్తున్న అన్నదానం షెడ్డుకు అవసరమైన ఫ్యాన్లు వంగలపూడి బ్రదర్స్ బహుకరించారు. గురువారం వంగలపూడి కాశీ విశ్వనాథం, వంగలపూడి సతీష్ మంగలపూడి శివకృష్ణ, వంగలపూడి సురేష్, వంగలపూడి మణికంఠ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ఎండాకాలంలో గర్భిణులు పలు అవస్థలు పడుతున్నారన్నారు. ఫ్యాన్లు బహుకరించిన వంగలపూడి సోదరులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు నవీన్ నాని, దేవత రాజేష్‌కుమార్, జయశ్రీ, లక్ష్మి, సత్యరాణి, రత్నం, భుజంగరావు, వడ్డి సత్యనారాయణ, కోరుకొండ ప్రశాంత్, స్వామి, ఆనంద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపర్చిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - శంఖవరం

రెండు రోజుల క్రితం శంఖవరంలో అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమానపర్చిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన నిందితుడిని 48 గంటలు తిరగకుండానే అరెస్టు చేసినట్లు చెప్పారు. గ్రామంలో నెలకున్న ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఎస్పి జి.బిందుమాధవ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, నిందుతుడిని అరెస్టు చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో సిసి పుటేజీల ఆధారం చేసుకుని విచారణ చేసినట్లు తెలిపారు. శంఖవరం గ్రామానికి చెందిన యువకుడు పడాల వాసు ఈ నెల 14వ తేదీ రాత్రి సమయంలో అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించే రీతిలో చెప్పుల దండ వేసినట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. వ్యక్తిగత కక్షతోనే ఈ ఘటనకు పాల్పడినట్లు, గత నెలలో జరిగిన ఒక సంఘటనను ఆధారంగా చేసుకుని ఈ ఘటనకు పాల్పడినట్లు నిందితుడు విచారణలో వెల్లడించినట్లు తెలిపారు. ఈ కేసులో ముద్దాయికి కఠిన శిక్ష పడేలా మరిన్ని సాంకేతిక ఆధారాలతో లోతైన దర్యాప్తు సాగుతుందన్నారు. శంఖవరంలో శాంతి కమిటీని ఏర్పాటు చేస్తామని, పోలీస్ పికెట్ కొనసాగుతుందన్నారు. ప్రజలంతా శాంతియుతంగా ఉండి, ప్రజాశాంతికి, శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా సంయమనం పాటించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఎఎన్ఎంకు గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

బైపాస్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిహెచ్సిలో పని చేస్తున్న ఎఎన్ఎం ఎలిపే వెంకటరత్నం తీవ్రంగా గాయపడ్డారు. విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో 216 జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలైన ఆమెను 108లో కాకినాడలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

లారీ డ్రైవర్‌కు జైలు శిక్ష

ప్రజాశక్తి - సామర్లకోట

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కి జైలు శిక్ష జరిమానా విధిస్తూ కాకినాడ 5వ కోర్టు న్యాయమూర్తి షేక్ షరీన్ గురువారం తీర్పు చెప్పారు. సామర్లకోట పోలీసుల సమాచారం ప్రకారం.. 2022 నవంబర్ 10వ తేదీన వేట్లపాలెం గ్రామానికి చెందిన చెందిన ఇద్దరు మహిళలు నడిచి వెళుతుండగా పెద్ద బ్రహ్మదేవం రైల్వే గేటు వద్ద అనకాపల్లి జిల్లా గుట్టివాడ గ్రామానికి చెందిన అద్దం భాస్కరరావు తన లారీని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. దీనిపై ఎస్ఐ సునీత కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం గురువారం న్యాయమూర్తి షేక్ షరీన్ ముద్దాయికి 6 నెలలు జైలు శిక్ష, రూ.5500 జరిమానా విధించారని తెలిపారు.

ఫొటో స్టూడియోలో చోరీ

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లిలోని ఆర్‌కె డిజిటల్ ఫోటో స్టూడియోలో చోరీ జరిగినట్లు స్టూడియో యజమాని కురేటి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం స్టూడియోకు వచ్చి చూడగా షాప్ షట్టర్ తాళాలు గుర్తు తెలియని వ్యక్తులు బద్దలు కొట్టి, స్టూడియోలో విలువైన పరికరాలు అపహరించినట్లు తెలిపారు. విలువైన మూడు కెమెరాలు, ఒక లాప్‌టాప్, రెండు హార్డ్ డిస్క్‌లను అపహరించారని, వీటి విలువ సుమారు రూ.1,80,000 ఉంటుందని రామకృష్ణ తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎక్సైజ్ సూపరిండెంట్, జి. అమర్ బాబు తన బందంతో కలిసి గురువారం మండలంలో ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కామనగరువు గ్రామంలో కామన రామకృష్ణ వద్ద నాటు సారా అమ్మకాలు నిర్వహిస్తున్నందున అతనిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఎసా స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్ కు తరలించారు. అలాగే యానాం లిక్కర్ అమ్మకాలు నిర్వహించే పాత నిందితుడు విలస గ్రామానికి చెందిన రాయి రాజేష్ ని అయినవిల్లి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి ఎదుట హాజరు పరచగా 129 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ ప్రకారం బైండ్ ఓవర్ చేసినట్లుగా అమలాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ విటివివి.సత్యనారాయణ తెలిపారు.

ఉన్నతమైన ఆలోచనలతో లక్ష్యాల సాధన : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ



వార్షికోత్సవ దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

ఉన్నతమైన ఆలోచనలతో లక్ష్యాన్ని సాధించేందుకు ముందడుగు వేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. గురువారం జెఎన్‌టియుకె వార్షికోత్సవ వేడుక యుసిఇజె ప్రిన్సిపల్ ప్రొ ఎన్.మోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలేజీలో విద్యనభ్యసించడం ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక మధురమైన జ్ఞాపకమన్నారు. ఒక మంచి కళాశాలలో చదివినపుడు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉన్నతమైన ఆలోచనలు జీవితాన్ని మారుస్తాయని, ఆలోచనల్లో ధైర్యం నింపి ముందడుగు వేస్తే దేనినైనా సులభంగా సాధించవచ్చునన్నారు. మంచి నడవడికతో విద్యార్థులు చిన్న తనం నుంచే విద్యపై మక్కువ చూపించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను, అకడమిక్ అవార్డులు, ఎండోమెంట్ అవార్డులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉపకులపతి ప్రొ సిఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక జీవితంలోని సామాజిక, సాంకేతిక మార్పులను అధిగమించినపుడే విద్యార్థులు సునాయాసంగా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించి మంచి నడవడిక అలవర్చుకునేలా తీర్చిదిద్దాలన్నారు. ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించి కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రొ ఎన్.మోహన్‌రావు కళాశాల వార్షిక నివేదికను, కోర్సుల వివరాలు, విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్స్ తదితర అంశాలను వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథులు సర్టిఫికెట్లను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆహుతులను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ కెవి.రమణ, ఒఎస్ ప్రొ డి.కోటేశ్వరరావు, యుసిఇకె వైస్ ప్రిన్సిపల్స్ ప్రొ ఎం.స్వరూపారాణి, ప్రొ జివిఎస్ఆర్.దీక్షితులు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, మాజీ ఉపకులపతులు, సీనియర్ ప్రొఫెసర్లు, బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవకతవకలపై సమగ్ర విచారణ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



గ్రామ సభలో ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

మండలంలోని కొవ్వాడ గ్రామ పంచాయతీలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. గురువారం సర్పంచ్ కోటిపల్లి ఉమా ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి శ్రీకాంత్‌కు ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. గత ఐదేళ్ల కాలంలో పంచాయతీలో అనేక అవకతవకలు జరిగాయని, ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలని, పందుల బెడదను నివారించాలని తీర్మానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్‌గౌడ్, జనసేన మండల ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి కిషోర్, జనసేన నాయకులు సానా శ్రీను, ర్యాలీ సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షులు గుమ్మడి వీరబాబు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు దుల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యా వ్యాప్తితోనే అంబేద్కర్‌కి నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు



సభలో మాట్లాడుతున్న భానుమతి

విద్యా వ్యాప్తితోనే డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని అంబేద్కరిస్టు, ప్రముఖ వైద్యురాలు కోరుకొండ భానుమతి అన్నారు. గురువారం మండలంలోని కోరంగి పంచాయతీ పాతకోరంగిలో న్యాయవాది యడ్ల కుటుంబరావు అధ్యక్షతన అంబేద్కర్ 134 వ జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలో అందరికీ అన్ని అవకాశాలు కల్పించిన అందరివాడు అంబేద్కర్ అని అన్నారు. వంటింటికే పరిమితమైన మహిళలకు ఆయన అనేక హక్కులు కల్పించారని అన్నారు. ప్రజాసంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, ఎండియుడబ్ల్యూఎ మండల అధ్యక్షుడు కన్నీడి వెంకటరమణ, ఉపాధ్యాయులు కాశి రవీంద్ర, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, ఎంపిటిసి పోతుల రత్నకుమారి, మాజీ జడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి, యానాం మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్, పెయ్యల రమేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా నవోదయకు ఎంపికైన చిన్నారి లాస్యను అభినందించి నగదు ప్రోత్సాహం అందజేశారు.

విద్యార్థుల నమోదుపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - సామర్లకోట, తాళ్లరేవు

మండలంలోని వేట్లపాలెంలో గురువారం స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎంఇఒలు శివరామకృష్ణయ్య, పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న రాయితీలు, ప్రాధాన్యతను వివరిస్తూ చైతన్య ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మళ్ళ రామకృష్ణ, సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్‌చౌదరి, హెచ్ఎం అనురాధ, ఎస్ఎంసి ఛైర్మన్ పీతల నాగశివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ సీతారామపురంలో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఒ మంగాయ్యమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ వి.మాధవి, ప్రజా సంఘాల నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, యుటిఎఫ్ నాయకులు నాగమణి, ఎం.తాతారావు, కట్టా ఈశ్వరరావు, హెచ్ఎం కె.నాగ కుమారి, నాయకులు టి.లక్ష్మణరావు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

ఘనంగా దొరబాబు పుట్టిన రోజు వేడుక

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. దొరబాబు నివాసానికి వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు చేరుకుని దొరబాబుకు పూలమాలలు వేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేక్‌ను కట్ చేయించారు..

న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి - పిఠాపురం


గ్రామంలో ఆందోళన చేస్తున్న స్థానికులు

మండలంలోని మల్లం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన పి.సురేష్ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్లో అంబేద్కర్ యువజన సంఘం, కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం, అంబేద్కర్ కూలీ సంఘం, మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ మల్లం గ్రామంలో బుధవారం ఓ ఇంటి వద్ద పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని, మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. కావున మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. సంఘటనా ప్రాంతానికి ఎస్ఐ జాన్‌భాషా చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి సింహాచలం, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఎద్దు సుబ్రహ్మణ్యం, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుబ్బల రాజు, కడితి కష్ణరావు, సత్తిబాబు, ఆర్.దుర్గారావు, నాగభూషణం, లచ్చబాబు, రాంబాబు పాల్గొన్నారు.

వైద్యానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - సామర్లకోట

కూటమి ప్రభుత్వ పాలనలో వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయలు చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. గురువారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక రైతు భవన్లో ప్రభుత్వ ఉద్యోగులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రభుత్వ వైద్యం ఎంతో మెరుగుపడిందన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెరుగైన వైద్య సేవలను అందించేందుకు సిఎం ఆలోచనలు చేస్తున్నారని అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారి కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ చంద్రశేఖర్ ఒడ్డి, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఎంపిడిఒ కె.హేమ మహేశ్వరి, ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది, కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు, పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు జ్ఞాపికల ప్రదానం

ప్రజాశక్తి - కరప

స్థానిక జడ్‌పి హైస్కూల్‌కు చెందిన జూనియర్ ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభను చాటుకున్న విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు. గురువారం సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మెమోంటోలతోపాటు, 25 జతల యూనిఫామ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ సానా సతీష్ బాబు ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ తాతీలు, స్టాఫ్ సెక్రటరీ ఎం.రమేష్, నక్క బుజ్జి, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు

పెద్దాపురం మండలంలోని కాండ్రకోట పిహెచ్‌సి వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. తమ న్యాయమైన కోర్కెలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఊర్మిళ, సౌజన్య, రాజీవ్, కళ్యాణి, సుధారాణి పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు మండలం గాడిమొగ పిహెచ్‌సి వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెర్సిస్, తనిష్క, హేమంత్, పి.ప్రసాద్, సింధూజ, హేమలత, శాంతి పాల్గొన్నారు.

పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.అప్పారావు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూనియన్ మండల అధ్యక్షుడు ఆర్‌వి.పల్లేశ్వరరావు అధ్యక్షతన యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల హక్కుల సాధన, వారికీ రావాల్సిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో యూనియన్ గౌరవ సలహాదారులు ఆచంట రామారాయుడు, పి.చంద్రరావు, నాయకులు ఎంవి.వీరభద్రస్వామి, ఎస్ఎం.రామారావు, కెపి.జగదీశ్వర్‌రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.